# నీట్ పరీక్ష వివాదం బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు

**- కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్**



**ఆదాబ్ సైబరాబాద్, శేరిలింగంపల్లి:** నీట్ పరీక్ష వ్యవహారంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత సాధించిన విజయం బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ అన్నారు. ఇది నేటి తరం యువత సాధించిన విజయమని, యువత సంకల్పిస్తే ఏదైనా సాధ్యమేనని ఆయన పేర్కొన్నారు."ఎదిరించే వారు లేనప్పుడు బెదిరించే వారు ఎక్కువవుతారు. కానీ యువత ఏకమైతే ఎలాంటి ప్రభుత్వాన్నైనా దిగివచ్చేలా చేయగలదు" అని ఆయన అన్నారు. నీట్ పరీక్ష వివాదంపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం యువత పోరాట ఫలితమేనని వ్యాఖ్యానించారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.నిరుద్యోగులకు హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేసి, యువత పక్షాన కేంద్ర ప్రభుత్వం నిలవాలని ఆయన అన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో బీజేపీకి ప్రజలు, ముఖ్యంగా యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ విజయం భావితరాలకు పునాదిరాయిగా నిలుస్తుందని పేర్కొన్న జిల్లా గణేష్, ప్రతి పరిపాలనా వ్యవస్థలో తప్పు చేసిన వారికి శిక్ష తప్పదనే భయం ఉండాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు చట్టాలకు లోబడి పనిచేసేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు."ఇది నయా భారత్... యువ భారత్. తప్పు ఎక్కడ జరిగినా ప్రశ్నించే ధైర్యం ప్రతి పౌరుడికి ఉండాలి" అని జిల్లా గణేష్ పిలుపునిచ్చారు.

# డ్రైనేజీ మూతలు లేక ప్రజలకు ప్రాణభయం..

**- నాసిరకం పనులపై కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**ఆదాబ్ సైబరాబాద్, నిజాంపేట్:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ ఆరోపించారు. నాసిరకం రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప నుంచి డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి వెళ్లే మార్గంలో డ్రైనేజీపై మూతలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ, కోట్ల రూపాయల ప్రజాధనంతో రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు నిర్మిస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు తీసుకుని నాసిరకం పనులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని అన్నారు.
గతంలో ఎన్ఆర్ఐ కాలనీలో డ్రైనేజీ కాలువలో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటనను గుర్తు చేస్తూ, అలాంటి విషాదాలు జరిగినా అధికారులు ఇప్పటికీ నిర్లక్ష్య వైఖరి వీడడం లేదని విమర్శించారు. అలాగే ఇంద్రన్న కాలనీలో కూడా డ్రైనేజీ మూతలు తెరిచి ఉండటంతో ప్రమాదం పొంచి ఉందన్నారు.
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఓపెన్ డ్రైనేజీలకు వెంటనే మూతలు ఏర్పాటు చేయాలని, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్ సదానందంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింగ్, రాజు, సురేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస నగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- కొలన్ హన్మంత్ రెడ్డి



**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ :** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్ డివిజన్--276లో ఉన్న శ్రీనివాస నగర్ కాలనీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు.
ఈ సందర్భంగా కాలనీలో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను పరిశీలించిన ఆయన, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు నాణ్యమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి), వారాగాని వాసు, కొలన్ జీవన్ రెడ్డి, మురళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావూరి మౌళేశ్వర్ రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఐక్యతకు దక్కిన విజయం

**- తెలంగాణ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్**



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకేజీలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలపై పోరాడిన లక్షలాది మంది విద్యార్థుల ఐక్య ఉద్యమానికి దక్కిన చారిత్రాత్మక విజయమని తెలంగాణ ఎన్ఎస్యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ పేర్కొన్నారు.
వరుసగా చోటుచేసుకున్న పరీక్షల అవకతవకలు, ఎన్టిఏ నిర్వహణలో లోపాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయడం స్వాగతించదగ్గ పరిణామమేనని ఆయన అన్నారు. అయితే వ్యక్తులు మారినంత మాత్రాన వ్యవస్థ మారదని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, జవాబుదారీతనం తీసుకురావడానికి సమగ్ర సంస్కరణలు జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.
ఎన్టిఏ రద్దు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను వెంటనే రద్దు చేసి, దాని స్థానంలో పారదర్శకతతో పాటు న్యాయ పర్యవేక్షణ కలిగిన స్వతంత్ర జాతీయ పరీక్షా మండలిని ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మండలిలో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి నిజాయితీ కలిగిన అధికారులను సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేశారు.
సీబీఐ విచారణ: ప్రశ్నాపత్రాల లీకేజీల వెనుక ఉన్న ముఠాలతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కేంద్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించి, కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులపై కేసుల ఉపసంహరణ: దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఆందోళనలు నిర్వహించిన విద్యార్థులపై నమోదు చేసిన పోలీసు కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయతను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గొల్ల జాన్ విజ్ఞప్తి చేశారు.

# పచ్చని కూకట్‌పల్లి హరిత హైదరాబాద్

**- లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: బండి రమేష్**





**ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి :** హైదరాబాద్ నగరాన్ని పచ్చటి హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం వనమహోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిలో 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో ప్రభుత్వ నర్సరీల ద్వారా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వసంతనగర్ డివిజన్ గోపాలనగర్ కాలనీ పార్కులో హెచ్ఎండీఏ డైరెక్టర్ రోహిత్, అసిస్టెంట్ డైరెక్టర్ చక్రపాణి సహకారంతో, మందలపు రోజారమణి ట్రస్ట్ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకుడు సాయిబాబా చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా బండి రమేష్ స్వయంగా మొక్కలు నాటి, కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కనీసం నాలుగైదు మొక్కలు నాటి వాటిని బాధ్యతగా సంరక్షిస్తేనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలమన్నారు.
"వృక్షో రక్షతి రక్షతః" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, వృక్షాలను కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడినట్టేనని ఆయన అన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని, ప్రతి కుటుంబం మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు.ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాన్ని నిర్వహించిన సాయిబాబా చౌదరిని బండి రమేష్ అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో విస్తృత స్థాయిలో మొక్కల నాటే కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక నాయకులకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో వసంతనగర్, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసబాబు, అరవింద్ రెడ్డి, రంగమోహన్, శివ, ప్రవీణ్, రామకృష్ణ, సత్యనారాయణ, రామారావుతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయం

**- దేశంలో మహిళలు, యువత పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తి: రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్**



**ఆదాబ్ సైబరాబాద్,శంకర్‌పల్లి:** -నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఈ దేశ యువ చైతన్యం సాధించిన ఘన విజయమని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ అన్నారు. దేశంలో మహిళలు, యువత చేస్తున్న పోరాటాలకు ఈ విజయం స్ఫూర్తినిస్తుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే అవినీతి బురదలో నిండా మునిగిపోయిన బీజేపీ కూటమి ప్రభుత్వానికి పతనం మొదలైందని ఆమె అన్నారు. విద్యా వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి, దేశ యువత ఆశలను, ఆశయాలను అధికార మదంతో అణచివేయాలని చూసిన మోడీ నియంతృత్వానికి రోజులు దగ్గర పడ్డాయని శ్రీజ్యోతి భీమ్ భరత్ విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ దేశ యువత పోరాటాన్ని ఆపబోదని, రాబోయే కాలంలో అన్ని శాఖల మంత్రులు, మోడీతో సహా గద్దె దిగాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ఈ దేశ యువత చేస్తున్న పోరాటంలో వారితో పాటు నిలిచి లాఠీ దెబ్బలు తిని, అక్రమ అరెస్టులకు సైతం సిద్ధపడిన కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని తెలిపారు. ఈ సందర్భంగా వెన్నుచూపకుండా మోడీ నియంతృత్వానికి వ్యతిరేకంగా, జాతి, కుల, మత, ప్రాంతీయ భేదా లను తొలగిస్తూ పోరాడి, విజయం సాధించిన ఈ దేశ యువత పోరాట స్ఫూర్తిని శ్రీజ్యోతి భీమ్ భరత్ అభినందించారు.

# సూరారం వాసుదేవ ఆశ్రమంలో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

- **13 అడుగుల హనుమంతునికి 108 లీటర్ల ఆవు పాలతో క్షీరాభిషేకం**
- **108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణంతో మార్మోగిన ఆశ్రమం**



**ఆదాబ్ సైబరాబాద్, సూరారం కాలనీ :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సూరారం కాలనీలోని శ్రీ వాసుదేవ ఆశ్రమంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలోని 13 అడుగుల ఎత్తైన శ్రీ హనుమాన్ విగ్రహానికి 108 లీటర్ల స్వచ్ఛమైన ఆవు పాలతో మన్యుసూక్త సహితంగా శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించారు.
ఆలయ ప్రధాన పూజారి శ్రీమాన్ సింహాచలం గీతా శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో ఈ దివ్య పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం భక్తులు ఏకకంఠంతో 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం చేయగా ఆశ్రమం అంతా భక్తి పారవశ్యంతో మార్మోగింది.

**-ప్రత్యేక ఆకర్షణగా 108 వడమాల సమర్పణ**
వేడుకల్లో భాగంగా శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి జ్యోతి కృష్ణమోహన్ దంపతులు స్వామివారికి 108 వడలతో రూపొందించిన ప్రత్యేక వడమాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.
అనంతరం విచ్చేసిన భక్తులకు విశేష అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ ఆశ్రమం ధర్మకర్త ఒకులాదేవి బ్రహ్మానందరావు, రేఖాజ్యోతి, గీత, శ్రీజ, హరికృష్ణ, కుమార్, అనిల్, శ్యామల, పద్మావతి, విజయ, వినిత, లక్ష్మి, గోవిందమ్మ, ప్రియా తదితర భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# మోకిల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ యోగేష్ గౌతమ్



**ఆదాబ్ సైబరాబాద్, శంకర్ పల్లి :-** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని మోకిల పోలీస్ స్టేషన్‌ను డీసీపీ యోగేష్ గౌతమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లోని రికార్డులు, కేసుల నమోదు, పెండింగ్ కేసుల స్థితి, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, బాధితులకు అందిస్తున్న సేవలు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ఫిర్యాదుల పరి ష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకో వా లని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సీ ఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో పచ్చదనం కోసం ఇంటింటికి ఐదు మొక్కలు



**ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్ :** హైదరాబాద్‌లో పచ్చదనాన్ని పెంచి భూగర్భ జలాలను సంరక్షించడమే వన మహోత్సవం లక్ష్యమని హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహితి గోపిడి తెలిపారు. వన మహోత్సవం--2026లో భాగంగా హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్ట్, రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి ఐదు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహితి గోపిడి మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం, భూగర్భ జలాలను కాపాడడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ముఖ్య అతిథి బండి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 16 కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో వన మహోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబు చౌదరి, హెచ్ఎండిఏ అసిస్టెంట్ డైరెక్టర్ చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్, ద మహిళలు తదితరులు పాల్గొన్నారు.

